# సంఘ ప్రభుత్వం

## (Church Government)

**పాఠ్యోద్దేశం** : విజయవంతమైన తండ్రులైవుండి, వాక్యమందును ఉపదేశమందును ప్రయాసపడుచు, దేవుని వాక్య ప్రకారం జీవించే నాయకులను కలిగి వుండిన సంఘ ప్రభుత్వం యొక్క విలువను చూపించటం మరియు సంఘ ప్రభుత్వం విషయంలో సంపూర్ణ పునరుద్ధరణకోసం విన్నపం చేయటం.

## ఉపోద్ఘాతము

*ఈలాగు ప్రభువైన యేసు వారితో మాటలాడిన తరువాత పరలోకమునకు చేర్చుకొనబడి, దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడయ్యెను. మార్కు 16:19*

యేసు పరలోకానికి తిరిగివెళ్లకపూర్వమే తాను తన రాజ్యాన్ని పాలించే విధానం ఎలా వుంటుందో తన శిష్యులకు ముందుగానే తెలియచేయటం జరిగింది. ఆయన వారితో ఈ క్రింది విధంగా చెప్పారు.

*అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్య ములోనికి నడిపించును ఆయన తనంతటతానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును. ఆయన నా వాటిలోనివి తీసుకొని మీకు తెలియజేయును గనుక నన్ను మహిమ పరచును. తండ్రికి కలిగినవన్నియు నావి, అందుచేత ఆయన నా వాటిలోనివి తీసికొని మీకు తెలియ జేయునని నేను చెప్పితిని. యోహాను 16:13-15*

యేసు నుండి స్వీకరించి పరిశుద్ధాత్ముడు అపొస్తులులకు అందించిన ఓ సందేశం వుంది. అది ఏదంటే, వారు అనగా అపొస్తలులు ప్రతి స్థానిక సంఘంలోను పెద్దలను నియమింపవలసినవారై ఉండిరి (అపొ. కార్య. 14:23). ఎఫెసు పట్టణ పెద్దలతో పౌలు మాట్లాడుచూ, "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి" (అపొ. కార్య. 20:28) అని చెప్పాడు.

ప్రపంచమంతటా ఉండిన క్రీస్తుసంఘాలు స్వయంప్రతిపత్తి కలిగివుండటం, వయస్సులో పెద్దవారైన భక్తిపరులు ఇద్దరి కంటె ఎక్కువ మంది తన పౌరులను పై విచారణ చేయటం మన రాజైన క్రీస్తు యొక్క పథకం (అపొ. కార్య. 14:23; తీతు. 1:5; ఫిలిప్పీ 1:1). ఇంతటి ఘనమైన నాయకత్వపు పాత్రను యేసు మనుష్యులకు ఎందుకు అప్పగించారోనని మనం ఆశ్చర్యపడవచ్చు. "అయినను, జ్ఞానము జ్ఞానమని దాని క్రియల వలన తీర్పుపొందును" (మత్తయి 11:19). మరోవిధంగా చెప్పాలంటే, యేసు యొక్క జ్ఞానాన్ని మనం అభినందించటానికి ముందుగానే యేసు ఏర్పాటుచేసిన సంఘ ప్రభుత్వ విధానాన్ని సంఘం తప్పక అను సరించాలి, తన సంఘాన్ని మనుష్యులు పైవిచారణ చేయటం వల్ల కలిగే కీడులు యేసుకు తెలియనివి కావు. పెద్దలతో మాట్లాడుతూ పౌలు "నేను వెళ్లిపోయిన తరువాత క్రూరమైన తోడేళ్లు మీలో ప్రవేశించు నని నాకు తెలియును వారు మందను కనికరింపరు" అని హెచ్చరించినాడు (అపొ. కార్య. 20:29). అతడు ఇంకా వారితోనే మాట్లాడుతూ, "మరియు శిష్యులను తమ వెంట ఈడ్చుకొనిపోవలెనని వంకర మాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలు దేరుదురు"ని చెప్పాడు (అపొ. కార్య. 20:30).

గడిచిన రెండువేల సంవత్సరాలుగా **సంఘ ప్రభుత్వం** విషయంలో "మహిమను వెదికే" మనుష్యులు వంకర బోధలు చేస్తూనే ఉన్నారు. యేసుకు మరియు యేసు నియమించిన విచారణకర్తలకు మధ్య కొన్ని పదవులు వారు కల్పించుకొన్నారు. అయితే, వాటిలో ఏ ఒక్కటీ బైబిలు ప్రకారం అధికారం పొందినవికావు. వారు పెట్టుకున్న బిరుదులు, పదవులు అన్నీ మానవుని మహిమకోసం మానవులచే కల్పింపబడినవే. ఆత్మీయభావంలో తండ్రిగా పిలువబడరాదని యేసు మనుష్యులను ఖండితంగా నివారించారు (మత్తయి 23:9). "రెవరెండు" అనేమాట బైబిల్లో ఒకేఒక్కసారి ప్రయోగింపబడింది అదైనా దేవునికి సంబంధించి మాత్రమే (కీర్తనలు 111:9). పదవు లను ఇవ్వటానికి మనుష్యులకే ఉన్నతస్థాయిని ఇవ్వటం సిలువ నీడలోనే ఆరంభ మైంది. నాలుగు గ్రూపులుగా విడిపోయే ప్రమాదం కొరింథీలో వున్న దేవుని సంఘానికి సంభవించటం జరిగింది. ఎందుకంటే, వారికి ఎవరెవరైతే వాక్యాన్ని బోధించారో వారిని హెచ్చించాలని వారు ఆశించారు. (1 కొరింథీ. 1:12, 13).

**మానవుల పారంపర్యాచారముల** ద్వారా మనకు అందించబడిన బిరుదులు మరియు పదవులు అనువాటితో లోకం నేడు పోరాడాలి. ఈలాటి బిరుదుల్ని, పదవుల్ని కల్పించుకోటం మానటానికి మనతరం ఇష్టపడటంలేదు. "ఇంకొక పాపాన్ని" కూడా మనం చేర్చబోతున్నాం. స్త్రీలు కూడా రెవరెండు బిరుదు ధరించటమే ఆపాపం ఆలాగే, స్త్రీ పురుషుల పాత్రలకు సంబంధించిన ప్రస్తుత గందరగోళం వల్ల రాబోయేతరం వారు తప్పక స్త్రీలనే ఫాదర్లుగా నియమించుకుంటారు మానవుల పారంపర్యాచారాలను విసర్జించి, సంఘ ప్రభుత్వం విషయంలో దేవుని ఉపదేశాల్ని బోధించనంతవరకు ఈ గందరగోళాన్ని అంతం చేయలేము.

యేసు రూపొందించిన సంఘ ప్రభుత్వ విధానాన్ని "క్రైస్తవ మత ప్రపంచం" ఎల్లప్పుడు పూర్తిగానే తిరస్కరించటం జరిగింది. దేవుని వాక్య విషయంలో అజ్ఞానం, అతిశయంతోనిండిన జీవపు డంబం, మరియు సంఘాన్ని పాలించటానికి అర్హతలు గలవారు లేకపోవటం అనేవి ఈ సమస్యకు సాధ్యమైన కారణాలు. ఈనాడు సంఘ ప్రభుత్వం విషయంలో మనం **లోపాలు** చేయటానికి కారణం చివరి విషయం అని క్రీస్తు సంఘాలు ఎన్నో చెబుతున్నాయి.

సంఘ ప్రభుత్వం విషయంలో బైబిలు వివరణలు ఇవ్వటంగానీ, మత సంబంధ మైన లోపాలను ఎత్తిచూపించటంగానీ ఈ పాఠంలో జరుగదు. అయినప్పటికినీ, మానవాళి కోసం దేవుడు చేసిన సంకల్పానికి యేసు రూపొందించిన సంఘ ప్రభుత్వం అనుగుణమైనందున, అది దేవుని రాజ్య పౌరుల మానసిక వాతావరణాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో చూపించటానికే ప్రయత్నం చేద్దాం. అల్ప సంఖ్యాక ఆధిపత్యం అంటే, కొద్ది మంది పాలన లేక విజయ వంతమైన తంత్రులుగా నిరూపించుకున్న వారితో కూడిన సంఘ ప్రభుత్వం అనేది అందించే ఆశీర్వాదాలు ఈ పాఠంలో బయలు పరచబడతాయి. యేసుయొక్క సంఘ ప్రభుత్వంలోని శక్తిని అర్థం చేసుకోవటానికి సంఘ పాలకులను వర్ణించే బిరుదులు మరియు వారికుండవలసిన అర్హతలను చదువు కుందాము. చివరిగా, సంఘ ప్రభుత్వం విషయంలో సంపూర్ణ పునరుద్ధరణను క్రీస్తు సంఘాల్లో ఎట్లు సాధించ గలమో ఆలోచన చేద్దాం (రోమా 16:16; 1 కొరింథీ. 1:2; 3:23; 12:12,13).

## పాఠము

ఈ పాఠం పేరు ప్రయోగింపబడినట్లుగా “ప్రభుత్వం” అనే మాటను 1 కొరింథీ. 12:28 లో కనుగొనవచ్చును. క్యుబెర్నేసి (KUBERNESIS) అనే గ్రీకు పదం “ప్రభుత్వములు” అని ఈ లేఖనంలో తర్జుమా చేయబడింది. డబ్ల్యు. ఇ. వైన్ (W. E. Vine) చెప్పినట్లు “క్యుబెర్నేసిస్” అంటే చుక్కానిని త్రిప్పటం, ఓడను నడపటం లేక త్రోవ చూపటం అని దాని భావం. ఈ పదం యొక్క భావాన్ని ఆలోచిస్తే ప్రభుత్వములు లేక ప్రభుత్వం చేయుట అని అర్థం వచ్చుచున్నది. సంఘ ఆరంభ సమయంలో యేసు మానవుల యొక్క సహజ సామర్థ్యాలకు సంఘ పరిపాలనను అప్పగించలేదు. ఎందుకంటే, సమస్తం సక్రమమైన రీతిలో ఆరంభం కావాలని ఆయన కోరుకున్నారు. అపొస్తలుల కార్యాలు రెండవ అధ్యాయంలో చెప్పబడిన సంగతుల ఆరంభం మొదలు కొని అపొస్తలులు సంఘాలను పై విచారణచేయటం లేక పాలించటం జరిగించారు.

అపొస్తలులు అప్పటికింకా సువార్త ప్రకటించుచుండటం, సంఘాల విషయమై జాగ్రత్త కలిగి సహాయం చేస్తుండటం, అపొస్తలుల కార్యాలు అనే గ్రంథం చివరి భాగంలో మనం చూడగలం. అయితే, స్థానిక సంఘములను పాలించటానికి పరిశుద్ధాత్ముడు కొందరికి శక్తిని అనుగ్రహించటం కూడా జరిగిపోయిందని మనం గ్రహించ గలం. అందువల్ల “ఆత్మసంబంధమైన వరములు” అనే కార్యక్రమం క్రింద ప్రతి స్థానిక సంఘంలోను పెద్దలు నియమింప బడ్డారు (1 కొరింథీ. 12:28-31). ఈ సంగతుల్ని నిశితంగా ఆలోచనచేస్తే అపొస్తలుల కార్యాలు అనే గ్రంథంలో సంఘ ప్రభుత్వం విషయంలో ఒక విధమైన చలనం మనకు అగుపిస్తుంది. అంటే, “అపొస్తలులు” పాలించిన సంఘముల నుండి, అపొస్తలులు -పెద్దలు పాలించిన సంఘములు, అపొస్తలులు పెద్దలు పాలించిన సంఘముల నుండి తుదకు పెద్దలే పాలించిన సంఘాలు మనం చూడగలుగు తాము (అపొ. కార్య. 6:2; 11:30; 15:1-6, 22,23).

పెద్దల పై విచారణ క్రింద అపొస్తలులు పనిచేయలేదు. పెద్దలు కలిగి వుండవలసిన అర్హతలను తెలియజేయటం, పెద్దలను నియమించటం మరియు అపొస్తలులు వెడలిపోయిన తరువాత రాబోయే ప్రమాదాల్ని గూర్చి హెచ్చరించటం అనేవి అపొస్తలుల యొక్క బాధ్యతలుగా ఉండినవి (1 తిమోతి. 3:1-7; తీతు 1:5-9; అపొ. కార్య.20:17-32). అయినప్పటికీ, అపొస్తలుల ద్వారా నడిపింపబడు సంఘములనుగానీ, కృపావర ములపై ఆధారపడి పెద్దలతోకూడిన సంఘ ప్రభుత్వాన్ని గానీ యేసు కోరియుండలేదని మనం చూడగలం. ఆయన కోరుకున్నది అర్హతలుగల పెద్దలతో కూడిన సంఘ ప్రభుత్వవిధానమే. తమకు కావలసిన హెచ్చరికల కోసం పెద్దలకు బైబిలు మాత్రమే అందుబాటులో ఉండే కాలం రాబోతుందని పౌలు ఆనాడే సూచించాడు (1 కొరింథీ. 13:8). ఏయే స్థానిక సంఘాలలో వారు సభ్యులై ఉంటారో ఆయా మందలను కాయటానికి కావలసిన నియమములకోసం పెద్దలు దేవుని వాక్యాన్ని వినియోగించు కోవలసినవారై ఉండిరి. ఎఫెసులోని పెద్దలతో పౌలు ఈ క్రింది విషయాన్ని చెప్పాడు.

> *ఇప్పుడు దేవునికిని ఆయన కృపావాక్యమునకును మిమ్మును అప్పగించుచున్నాను. ఆయన మీకు క్షేమాభివృద్ధి కలుగజేయుటకును, పరిశుద్ధపరచబడినవారందరిలో స్వాస్థ్య మనుగ్రహించుటకును శక్తిమంతుడు.* *అపొ. కార్య. 20:32*

మానవ విశేషకమైన తన రాజ్యాన్ని పాలించటానికి యేసు పెద్దల్ని వినియోగించు కొంటారు. వారిని గుర్తించటానికి ప్రయోగింపబడిన పదజాలాన్ని మనం అధ్యయనం చేస్తే బైబిలు ప్రకారమైన సంఘ ప్రభుత్వం యొక్క విలువను అర్థం చేసుకోవటానికి సహాయకరంగా వుంటుంది. అపొస్తలుల కార్యాలు 14:23లోను, మరికొన్ని ఇతర లేఖనములలోను ప్రెస్బ్యూటరాస్ (PRESBUTEROS) అనే గ్రీకు పదం పెద్దలు అని తెనిగించబడింది. అక్షరార్థంగా చెప్పాలంటే వయస్సులో పెద్దవారని దాని అర్థం. అయినప్పటికీ, కేవలం వయస్సులో పెద్దవారైనంతమాత్రాన సంఘంలోని నాయకుల స్థానం వారికి దక్కదు. సంఘ సభ్యులేవారిని అధ్యక్ష స్థానంలో నియమింపవలసివుంది. తోడిపెద్దనని తనను గూర్చి తాను చెప్పుకొనిన పేతురు,“చిన్నలారా, మీరు పెద్దలకు లోబడి యుండుడి” అని చెప్పాడు (1 పేతురు 5:1-5).

ఫిలిప్పీ 1:1 మరియు అపొ. కార్య. 20:28లో “ఎపిస్కోపాస్” (EPISKOPOS) అనే గ్రీకు పదం అధ్యక్షులు అని తర్జుమా చేయబడింది. తీతు 1:5,7 లో అధ్యక్షుడు పెద్ద అనే మాటలు పర్యాయ పదాలుగా ప్రయోగింపబడ్డాయి. పై విచారణ చేయు వాడు అని దాని భావం. అపొస్తలుల కార్యలు 20:28లో అధ్యక్షులు దేవుని సంఘాన్ని కాయాలని హెచ్చరింపబడ్డారు. కొన్ని తర్జుమాలలో “కాయుట” అనే మాటకు బదులుగా “మేపుట” అనే మాట వాడబడింది. ఈ రెండు పదాలు “పాయిమెన్” (POIMAINO) అనే గ్రీకు పదం నుండి తర్జుమా చేయబడ్డాయి. కాపరి పనిచేయటం అని దాని భావం “పాయిమెన్” (POIMAINO) అను గ్రీకు మాట సాధారణంగా “మేపుట” అనే

అర్థాన్నే ఇస్తుంది. ఎఫెసీ. 4:13లో ఈ మాట "కాపరులు" అని తర్జుమా చేయబడింది. మొదటి శతాబ్దంలోని సంఘ సభ్యులకు ఇవ్వబడిన కృపా వరములలో ఇది యొక వరమై ఉండినది. ఈ లేఖనం (ఎఫెసీ. 4:13)లో సువార్తికులు కూడా ప్రస్తావించ బడ్డారు. అందువల్ల కాపరులు (pastors) అనే పదం పెద్దలకే తప్ప సువార్తికులకు వర్తించదని భావించవచ్చును. యేసే "ఆర్చిపాయిమెన్" (ARCH POIMEN) లేక ప్రధానకాపరి (1 పేతురు 5:4). ఈ పదాల భావాన్ని అర్థం చేసుకొన్నప్పుడు సంఘ ప్రభుత్వ విషయంలో యేసు వెల్లడిపరచిన గొప్పజ్ఞానాన్ని మనం మెచ్చుకోగలుగుతాము. "మంచి గొఱ్ఱెలకాపరి" మనస్తత్వాలుగల పెద్దలు తన సంఘాన్ని కాపాడాలనీ, నడిపించాలనీ, పోషించాలనీ యేసు కోరుచున్నారు. ఈనాడు అపొస్తలులు మనలో లేరు అద్భుతమైన ఆత్మీయ వరాలు నిలిచిపోయాయి. అయితే, తన లక్ష్యాల కోసం ఎంతో యుక్తమైన సంఘ ప్రభుత్వ విధానాన్ని మనం కలిగివున్నామని యేసు నమ్ము తున్నారు. ఎందుకంటే, అట్టి సంఘ ప్రభుత్వ రూపాన్ని నియమించినది ఆయనే!

పైన చెప్పబడిన పదములన్నీ యూదా క్రైస్తవులకు సుపరిచితమే. పాతనిబంధనలో అవి సామాన్యమైన మాటలు. ప్రజలలో ఉండే పెద్దలను మోషే ఒకసారి పిలవటం జరిగింది (నిర్గమ 19:7). ఉజ్జీ అనే వాడు లేవీయులలో ప్రధానుడని నెహెమ్యా చెప్పాడు (నెహెమ్యా 11:22). "నామందలో చేరిన గొఱ్ఱెలను నశింపజేయుచు, చెదర గొట్టు కాపరులకు శ్రమ" అని యిర్మీయా పలికాడు (యిర్మీయా 23:1) దేవుని మందకు కాపరిగా యేసు తననుగూర్చితాను చెప్పుకున్నారు. అంతేకాదు ఒక మంచి కాపరి తన గొఱ్ఱెలను మేపటంకంటే మించిన కార్యాన్నికూడా చేయగలడని ఆయన సూచించి నారు. అవసరం వస్తే మంచికాపరి గొఱ్ఱెలకోసం ప్రాణాన్ని కూడా పెట్టగలడు (యోహాను 10:10-16).

1 తిమోతి 3:1-7 మరియు తీతు 1:5-9లో పెద్దల అర్హతలు వివరించబడ్డాయి. "క్రీస్తునందున్న" క్రైస్తవుల మానసిక వాతావరణం మీద అధ్యక్ష స్థానం యొక్క విలువ ఎలా వుంటుందో ఎక్కువగా గ్రహించుకోటానికి వాటి అధ్యయనం కూడా ఎంతో సహాయకరంగా వుంటుంది. పెద్దల అర్హతల విషయంలో తిమోతీకి హెచ్చరికలీయ టానికి ఈ క్రింది పదములను పౌలు వాడినాడు.

- అధ్యక్షపదవి, గ్రీకు: ఎపిస్కోప్ (EPISKOPE), పై విచారణ, పై విచారణచేయువాడు
- నిందారహితుడు, గ్రీకు: ఎనెపిలెప్టాస్ (ENEPILEPTOS), పట్టుబడియుండనివాడు, నిందించటానికి అవకాశం ఇవ్వనివాడు.
- మితానుభవుడు, గ్రీకు: నెఫ్తాలియోస్(NEPTHALIOS), మత్తుపదార్థాల ప్రభావం సోకనివాడు.
- స్వస్థబుద్ధిగలవాడు, గ్రీకు: సోఫ్రాన్ (SOPHRON), ఆరోగ్యకరమైన మనస్సును సూచించును. ఆశానిగ్రహముగలవాడు.
- మర్యాదస్థుడు, గ్రీకు: కాస్మియోస్ (KOSMIOS), గౌరవపదంగా జీవించేవాడు.
- అతిథిప్రియుడు, గ్రీకు: ఫిలోహినాస్ (PHILOHENOS), అతిథులను ప్రేమించువాడు.
- బోధింపతగినవాడు, గ్రీకు: డిడాక్టికాస్ (DIDAKTIKOS), "హితబోధవిషయమై జనులను హెచ్చరించుటకును, ఎదురాడువారిమాట ఖండించు టకును శక్తిగలవాడగునట్లు ఉపదేశమును అనుసరించి నమ్మదగిన బోధను గట్టిగా చేపట్టుకొనువాడై ఉండవలెను (తీతు 1:9) ఈ స్థాయిలో బోధింప సమర్థుడు.
- మద్యపానికానివాడు, గ్రీకు: పరోయినాస్ (PAROINOS), మిగులమద్య పానాసక్తుడు కాడు.
- కొట్టువాడుకాడు, గ్రీకు: ప్లెక్టెస్ (PLEKTES), జగడగొండికాడు
- ధనాపేక్షలేనివాడు, గ్రీకు: ఎయిస్క్రోకెర్డిస్ (AISCHROKERDES), ఈ మాట కొన్ని వ్రాతప్రతులలో లేదు), ధన వ్యామోహం లేనివాడు అన్యాయంగా సంపాదించాలనే దురాశగల లోభికాడు.
- సాత్వీకుడు, గ్రీకు: ఎపియీకస్ (EPIEIKOS), నిష్పక్షపాతి, అన్యాయం లేనివాడు, మర్యాదస్థుడు, సహించుకొనేవాడు.
- జగడమాడనివాడు, గ్రీకు: ఎమఖోసో (AMOCHOSO), ఎదురాడనివాడు, పోరాడని వాడు.
- దుర్లాభము అపేక్షించువాడు కాడు, గ్రీకు: ఎఫిలార్గురోస్ (EPHILARGUROS), ధనమును ప్రేమించనివాడు లోభత్వం లేనివాడు.
- పాలించువాడు, గ్రీకు: ప్రాయిస్టెమీ (PROISTEMI), ముందుగానడుచువాడు లేదా నడిపించువాడు (to set or place or before).

యేసు యొక్క మందను కాచే కాపరులు మర్యాదస్థులును, మత్తు పదార్థములను సేవించనివారును, ఆశానిగ్రహం కలవారును, ఆతిథ్యమిచ్చేవారును, ధనాపేక్షలేని వారునై ఉండాలని యేసు కోరుకుంటున్నారు. పైన చెప్పుకొనిన లక్షణాలతో చేర్చబడిన లక్షణాలు మరికొన్ని ఉన్నాయి, ఆ లక్షణాలు ఇవే. పెద్దగా మందకు సేవచేయాలనే కోరిక కలిగివుండాలి. ఏకపత్నీ పురుషుడై ఉండాలి. సంఘంలో చాలకాలం నుండి ఉన్నవాడై ఉండాలి. సమాజంలో మంచి పేరుపొందినవాడై ఉండాలి. ఇన్ని అర్హతలు కలిగివుండినా వారింకా విజయవంతమైన తండ్రులుగా నిరూపించుకోవటం అత్యంత ప్రాముఖ్యమైన అర్హత కాబోలు! అందుకే పౌలు, "ఎవడైనను తన ఇంటి వారిని ఏలనేరకపోయినయెడల అతడు దేవుని సంఘమును ఏలాగు పాలించును?" అని ప్రశ్నించాడు (1 తిమోతి. 3:5). దేవుని కుటుంబంలో మనం ఒక శాశ్వత భాగం కావలసినవారం. అందుచేత, **కుటుంబ వాతావరణంలో** పెరిగిన క్రైస్తవులను దేవుని యొద్దకు తీసుకొని వెళ్లాలని యేసుకు తెలుసు (గలతీ. 4:7).

దేవుని యొక్క పథకాన్ని ఆరంభంనుండి ఆలోచించుదాము. అన్నిటికంటే ముందుగా ఒక భౌతిక కుటుంబం ద్వారా ఈ లోకంలోనికి వచ్చే అవకాశాన్ని దేవుడు మనకిచ్చాడు (ఆదికాండం. 5:1-3). అయినప్పటికీ, కుటుంబ పెద్దలు తమ పిల్లలను దేవుని కుమారులుగా సాంఘీకీకరణం చెందించటంలో విఫలమైనప్పుడు, మనకోసమైన దేవునిలక్ష్యం సాధింపబడటానికి వీలుగా భౌతిక కుటుంబానికి భిన్నమైనది ఒకటి అవసరమైంది. మానవుని కోసమైన దేవునిసంకల్పం మొత్తంలో కుటుంబాలలోని తండ్రులు విఫలమైన సమయానికి ఉదాహరణ నోవహు కాలమే. కానీ, ఆకాలంలో మరే వ్యవస్థ పని చేయలేదు (ఆది. 6:1-8). మనం ఈ రోజు సంఘాన్ని కలిగియున్నాం.

దేవుడు మనల్ని ఎందుకు సృష్టించినాడో, దేవుని కుమారులుగా దేవునిరాజ్యాన్ని మనం ఎట్లు స్వతంత్రించుకోబోతున్నామో మనం ధ్యానించినయెడల, పెద్దలు విజయ వంతమైన కుటుంబ అర్హతలు కలిగివుండాలని యేసు ఆదేశించటం మనకు ఆశ్చర్యాన్ని కలిగించదు. మనకోసం యేసు తిరిగిరాబోతున్నారు. అప్పుడు మనం దేవునిరాజ్యంలో దేవుని కుమారులందరితో కలిసిపోవటానికి సిద్ధంగా ఉండాలని ఆయన నిరీక్షిస్తున్నారు (2 థెస్స. 1:10-12). తత్ఫలితంగా, కుమారుని పాత్రను మనం నేర్చుకోవటమే ప్రస్తుత కార్యక్రమం అయ్యింది. పరిశుద్ధపరచబడు కార్యక్రమంలో పెద్దలు మనల్ని నడిపించ టానికి పూర్వమే వారు విజయవంతులైన తండ్రులై ఉండాలి. నిశ్చయంగా, దేవుని పునర్నిర్మాణకార్యక్రమంలో మనల్ని నడిపించటానికి పెద్దలకు మించిన అర్హతలు గల వారు ఎవరూ లేరు (ఎఫెసీ. 2:10). క్రైస్తవులమైన మనం మార్పుచెందుతూ ఉన్నాము. మన ప్రస్తుతపరిస్థితి ఈ క్రింది లేఖనంలో వర్ణించబడింది:

> *కాబట్టి మీరిక మీదట పరజనులును పరదేశులునైయుండక, పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని యింటివారునై యున్నారు. క్రీస్తుయేసే ముఖ్యమైన మూలరాయి యై యుండగా అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాదిమీద మీరు కట్టబడి యున్నారు. ప్రతికట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి, ప్రభువునందు పరిశుద్ధ మైన దేవాలయమగుటకు వృద్ధిపొందుచున్నది. ఆయనలోమీరు కూడ ఆత్మ మూల ముగా దేవునికి నివాసస్థలమై యుండుటకు కట్టబడుచున్నారు. ఎఫెసీ. 2:19-22*

ఇప్పుడు మనం అపొస్తలులు, ప్రవక్తలు వేసిన పునాది మీద కట్టబడిన దేవుని ఇంటి వారమని దయచేసి గమనించండి. యేసుక్రీస్తే మూలరాయి. క్రైస్తవులు ఆయనలో చక్కగా అమర్చబడి," "ఆయనలో ...కట్టబడుచున్నారు" అని కూడా దయతో గమనించండి. అమర్చబడుట, కట్టబడుట అనే మాటలలో ప్రయోగింపబడినకర్మార్థక క్రియాజన్య విశేషణం ఒక విషయాన్ని సూచిస్తుంది. అదేమంటే, ఇతరుల ద్వారా మనం అమర్చబడుచున్నాము కట్టబడుచున్నాము. ఇతర సభ్యులతో పాటుగా దేవుడు నివసించే పరిశుద్ధ ఆలయంగా నిర్మింపబడటమే దాని ఫలితం. దేవుడు మనకు తండ్రియై ఉన్నందున, దేవుని నివాసంలో మనకీయబడిన సముచిత స్థానంలో మరింత అధికంగా నిర్భయులమౌతాము దేవుని యొక్క గృహంలోనికి మనం సాంఘీకీ కరణం చెందుతున్నాం. అంటే, పరిశుద్ధపరచబడుతున్నాము. యేసు యొక్క పని ఫలాన్ని దేవుడు తన నిత్యరాజ్యానికి చేర్చునప్పుడు ఆ రాజ్యానికి ఒక క్రొత్త విశేషకం చేర్చబడుతుంది. దయచేసి 1 పేతురు 2:4-10 ఆలోచించండి.

నేడు కూడా క్రైస్తవ తండ్రులు తమ పిల్లలకు కోపము రేపక, ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచాలని హెచ్చరింపబడ్డారు (ఎఫెసీ. 6:4). అయిన ప్పటికినీ, మనం మన పిల్లలను ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను పెంచుతున్న **విజయవంతమైన తండ్రులు** మనలను పైవిచారణ చేయునట్లు తన యొక్క జ్ఞానమును బట్టి మనరాజైన యేసు నియమించారు. ఈ విధమైన సంఘ ప్రభుత్వం యొక్క విలువ స్పష్టమే. యౌవనస్థులైన తండ్రులకు అంతకు పూర్వం తండ్రులుగా తర్ఫీదు ఉండదు. అందుచేత, సంఘంలో పెద్దలు కావటానికి పూర్వం సంఘ పరిపాలనలో అభ్యాసం పొందటానికి వారికి అవకాశం ఇవ్వబడదు. అయినప్పటికీ, మన ప్రభువు రూపొందించిన రీతిలోనే సంఘములు పనిచేస్తే, సాహసవంతమైన ఈ గొప్ప పనిలో విజయవంతులైన తండ్రులుగా వారు మనలను నడిపించే పైవిచారణకర్తలు కాగలరు. వారే సంఘ పెద్దలు అవుతారు.

పెద్దలు దేవుని వాక్యాన్ని బాగా పరిశీలిస్తారు. అది తమ పిల్లలను పెంచు ఉత్తమం, అనుకూలం మరియు సంపూర్ణం అయిన మార్గమని వారు నిరూపిస్తారు (రోమా. 12:2). ప్రతి విధమైన గౌరవముతో వారి కుటుంబాలను వారి ఆధీనములో ఉంచుకొంటారు (1 తిమోతి 3:4). **వాస్తవికతను వ్యాఖ్యానించటానికి** దేవుని వాక్యాన్ని వినియోగించటం ఎలాగో తమకు తెలుసునని "జీవితప్రయాణం"లో వారికి వెనుక ఉండిన వారికి పెద్దలు నిరూపిస్తారు. ప్రతితరంలోను వాస్తవికతను సరిగా వ్యాఖ్యానించవలసిన అవసరం వుంది. తన సంఘాన్ని పాలించు నట్లు మానవులకు అధికారాన్ని వినియోగించటానికి యేసు ఇష్టపడింది ఇందుకే. సంఘ సభ్యులంతా దేవుని వాక్యాన్ని సమీపించవచ్చు. అయితే, దేవునివాక్యం ద్వారా వాస్తవికతను యుక్తముగా వ్యాఖ్యా నించునట్లు ఆత్మీయపెరుగుదల మరియు బైబిలు జ్ఞానం అందరికీ వుండవు. పెద్దలకు మాత్రమే ఇవి ఉంటాయి. కాబట్టి, మిగిలిన మనలనందరినీ వారే కాయగలరు.

బహుశా, మన ఆత్మీయాభివృద్ధికి మనపిల్లలను యుక్తంగా పెంచటం ఒక్కటే సరిపోదేమో! వాస్తవానికి, అపొస్తలుడైన పౌలు నిర్ణయించుకొన్న రీతిగా ఎన్నటికీ వివాహం చేసుకోరాదని మనం కూడా నిశ్చయం చేసుకోవచ్చు (1 కొరింథీ. 7:26). మనం పెండ్లిచేసికొన్నా, పెండ్లిచేసుకోకపోయినా సరే క్రీస్తు శరీరంలోని మిగిలిన సభ్యులతో పాటుగా ఏకముగా అమర్చబడి, కట్టబడవలసినవారమై ఉన్నాము. "అలాగే అనేకులమైన మనము క్రీస్తులో ఒక్క శరీరముగా ఉండి, ఒకనికొకరము ప్రత్యేకముగా అవయవములమై యున్నాము" అని పౌలు చెప్పాడు (రోమా. 12:5). ఆరోగ్యకరమైన మానవులుగా మనం వృద్ధిచెందటంలో భౌతిక కుంటుంబాలు ప్రముఖపాత్ర వహిస్తాయి. అయినను, భౌతిక కుటుంబాలు కేవలం ఈ లోకం కోసమే. "తండ్రినైనను తల్లినైనను నాకంటె ఎక్కువగా

ప్రేమించువాడు నాకు పాత్రుడుకాడు" అని యేసు చెప్పారు (మత్తయి 10:37). క్రీస్తునందున్న మిగిలిన క్రైస్తవులతోపాటుగా మనం సహోదరులుగా, సోదరీలుగా చక్కగా అమర్చబడాలి (2 కొరింథీ. 6:18). స్థానిక సంఘమంటే నిత్యమైన కుటుంబమని ఆలోచించటం మనం నేర్చుకోవాలి.

మన సహోదరులను హృదయ పూర్వకంగాను, మిక్కటముగాను మనం ప్రేమించాలని క్రైస్తవులమైన మనల్ని పేతురు హెచ్చరిస్తున్నాడు. ఎందుకంటే, మనం అక్షయబీజం నుండి పుట్టింపబడినవారం (1 పేతురు 1:22,23). "పవిత్రమైన ముద్దు పెట్టుకొని సహోదరుల కందరికిని వందనములు చేయుడి" అని పౌలు చెప్పు చున్నాడు (1 థెస్స. 5:26). ఒక కుటుంబపు పరిధిలోనికి అమర్చ బడటానికే మానవులు నిర్మింపబడ్డారు. అదే దేవుని యొక్క కుటుంబం. మనుష్యులలో కొందరు కుటుంబ వాతావరణంలో అమరలేనివారుఅయ్యారు. అయితే, యేసు మనల్ని చక్కగా అమర్చటానికి ఇష్టపడుతున్నారు. ఈ లోకంలో మనం జీవించి యుండిన కాలంలో మనలను నడిపించటానికి విజయవంతమైన కుటుంబస్థులను వినియోగించుకొనియేసు ఆ పని జరిగిస్తున్నారు. సంఘం ఒక కుటుంబంవలె పనిచేయునట్లుగా దానిని మరింత చక్కగా నడిపించ గలవారు విజయవంతమైన తండ్రులైన పెద్దలు గాక మరెవరు?

లోకం ఎదుట సంఘం కలిగి వుండవలసిన పేరు ప్రఖ్యాతుల విషయంలో యేసు ఆలోచన కలిగి వున్నారు. అందువల్లనే సంఘంలోని పెద్దలు వెలుపటివారిచేత **మంచి సాక్ష్యము** పొందినవారై ఉండాలి. పెద్దలకివ్వబడిన స్థానం ఇతరులకు సేవచేయటానికే తప్ప తమ స్వకీయ మహిమ కోసం కాదని వారు గ్రహించుకోగలుగునట్లు చాలకాలంగా వారు విశ్వాసులైన సంఘ సభ్యులుగా జీవించి ఉండాలి. ఈ సంఘ నాయకుల కుటుంబాల వల్ల లోకానికి మేలు చేకూరుతుంది. ఒకవేళ సంఘ నాయకులు అప మర్యాదంగా పాలిస్తే సువార్త ప్రకటనా కార్యక్రమాలకు అపవాది ఆటంకాలు కలుగచేస్తాడు. అయితే, యేసు చెప్పిన సంఘ ప్రభుత్వ విధానం అమలు జరపబడితే సంఘం తల పెట్టిన సువార్త ప్రకటనా కార్యక్రమాలకు అపవాది ఆటంకాలు కలుగజేయజాలడు.

భూమి మీద జీవించుచుండిన తన ప్రజల్ని నడిపించటానికి యేసుచే నియమింపబడిన పెద్దలు సంఘాన్ని ఎలా కాయాలని మనం ఆశిస్తామో అదే విధమైన నాయకత్వం వృద్ధ అపొస్తలుడు యోహానుచే వ్రాయబడిన మూడు పత్రికలలో వర్ణింపబడిం దేమో! సాత్వీకమైన మనస్సుతోనే ఒప్పించే ధోరణిని ప్రదర్శించి యోహాను ప్రేమ, ధైర్యం మరియు సత్యం అనే వాటిని గూర్చి మాట్లాడటం జరిగింది. అయినప్పటికీ, "క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు" అని అతడు హెచ్చరించటం కూడా జరిగింది (2 యోహాను 9). దేవుని వాక్యాన్ని నేర్చుకొని ఉండటమే కాక దాని ప్రకారం జీవించటం ఎలాగో ఎరిగి యుండిన వ్యక్తి ద్వారా వ్రాయబడినట్లు యోహాను పత్రికలు కన్పిస్తున్నాయి. పెద్దల చిహ్నం ఇదే. పెద్దలు అనేవీరు ఆత్మీయ సఫలతను కొంతవరకూ అనుభవించిన మనుష్యులు. ఎందుకంటే, దేవుని వాక్యాన్ని బట్టి వాస్తవికతను వారు వ్యాఖ్యానించ గలరు. తన సంఘం యొక్క ప్రభుత్వాన్ని యేసు ఈ తరహా మనుష్యులకే అప్పగిం చారు. మన యొక్క మానసిక వాతావరణం విషయంలో ఇట్టి పెద్దల వలని విలువను ఎట్లు వర్ణింపగలం? భూమిమీద దావీదు జీవించిన కాలంలోని గొఱ్ఱెలమంద యొక్క మానసికవాతావరణం మీద కాపరి ప్రభావాన్ని గూర్చిన అధ్యయనం మనకు కొంత సహాయకరంగా వుంటుందేమో! దయచేసి, 23వ కీర్తనను జ్ఞాపకం చేసుకోండి. ఒక్క మాటలో చెప్పాలంటే, "కాపాడబడితిమి" అనే అనుభూతి మనకు కలుగుతుంది.

బైబిలు గ్రంథంలో మనం చదువుకొనే సంఘ ప్రభుత్వం పని చేయటం ఈనాటి మతప్రపంచంలో మనకు అరుదుగా కన్పిస్తాది. సంఘ ప్రభుత్వ విషయంలో బైబిలు విధానంలో నుండి మానవులు ఎట్లు తొలగిపోయారో తెలియజేయటానికి సాధ్యమైన కొన్ని కారణాలను మనం ఇపుడు విశదీకరించుకుందాం. అలాగే, క్రొత్త నిబంధన సంఘ ప్రభుత్వ సంపూర్ణ పునరుద్ధరణ కోసం కొన్ని పరిష్కార మార్గాలు సూచించుదాము. ముందుగా, "క్రైస్తవ మత ప్రపంచం" దాని ప్రస్తుత పరిస్థితులలోనికి ఎలా వచ్చిందో అనుదానికి సంబంధించి మా యొక్క అభిప్రాయాన్ని తెలియజేస్తాము. మన యొక్క నాయకత్వపు సమస్యలు ఈనాటివి కావు. క్రైస్తవ యుగానికి ఎంతో కాలం ముందటే అవి ప్రారంభమైపోయాయి. మానవుడు భూ లోకంలో మహిమ కోసం ఆశించటం మరియు మానవునిలోని నైతిక బలహీనతలు పాత నిబంధన కాలంలో దేవుని రాజ్యం కోసమైన దేవుని పథకాన్ని భంగం చేశాయి. లేవీ యాజకత్వంలో మానవులను దేవుడు ప్రధాన యాజకులుగా నియమించాడు. అయితే, రాచరికాన్ని మాత్రం ఆయన తన కోసం కేటాయించు కున్నాడు. తరువాత, న్యాయాధిపతుల కాలంలో ఇశ్రాయేలీయులు సకల జనుల మర్యాద చొప్పున రాజు కావాలని కోరుకున్నప్పుడు దేవుడు రాచరికాన్ని మానవులైన రాజులకు అప్పగించాడు (1 సమూయేలు 8:7). అయితే, ప్రధాన యాజకులు, రాజులు కూడా తమతమ నాయకత్వపు స్థానములను కలుషితం చేశారు (1 సమూయేలు 3:13; 13:13). దేవుని రాజ్యంలో నేడు ఈ సమస్య అంతా పరిష్కరింపబడింది. ఎందుకంటే, దేవుడు ఉన్నత స్థానములలో నుండి మానవుల్ని తొలగించి వేసాడు. రాచరికం మరియు యాజకత్వం రెండూ యేసుక్రీస్తుకే ఇవ్వబడ్డాయి (1 తిమోతి 6:15; హెబ్రీ. 8:1).

దేవుడు ముందుగానే జాగ్రత్తలు వహించాడు. అయినప్పటికీ, **నాయకత్వపు పాత్రల** విషయంలో క్రైస్తవ యుగంలో కూడా ఇంకా సమస్యలు ఉండటం మనం చూస్తున్నాం. ఇంతకు పూర్వమే సూచింపబడినరీతిగా, కొరింథులోని సంఘం నాలుగు విధాలుగా చీలిపోయింది. "మేము క్రీస్తువాళ్లం" అని ఒక గ్రూపు చెప్పకొంటే మిగిలిన మూడు గ్రూపులు వారికి క్రీస్తును ప్రకటించిన ఉపదేశకులతో తమ్మును తాము గుర్తింపచేసుకున్నారు (1 కొరింథీ. 1:12). "మనుష్యరీతి" గానే

వారు నడుచుకొన్నారు. మనుష్యరీతి అనే మాట యొక్క నిర్వచనం కోసం దయచేసి, 1 కొరింథీ. 3:1-4 చదవండి. వారికి భక్తి వుంది కానీ, వారు శరీర సంబంధులైన మనుష్యుల్లా ఆలోచించారు. క్రీస్తునందు వారు పసిపిల్లలు. దేవుని రాజ్యంపై యేసు క్రియాశీలుడైన రాజని గ్రహించుకోటానికి వారు వాస్తవికతను వ్యాఖ్యానించలేకపోయారు. తత్ఫలితంగా వారు గుర్తింపు కోసం మానవుణ్ణి వెదికారు. కొరింథీ సంఘంలో జరిగినట్లుగా నేడు కూడా సంఘంలో "దొంగ అపొస్తలులు" లేదా "మోసగాండ్రగు పనివారు" ప్రవేశిస్తే ఆ సంఘంలో విభజన సంభవించగలదు (2 కొరింథీ 11:13). మహిమ కోసమైన కోరిక యొక్క సంతృప్తి నిమిత్తం తగినంత బలమైన నిరీక్షణ కలిగివుండని సంఘ నాయకులే మోసగాండ్రగు పనివారుగా పనిచేయగలరు. అట్టివారు శిష్యులను తమవెంట ఈడ్చుకొని పోతారు. ఎఫెసులోని సంఘ పెద్దలను పౌలు ఈ క్రింది విధంగా హెచ్చరించాడు. నేను వెళ్లిపోయిన తరువాత క్రూరమైన తోడేళ్లు మీలో ప్రవేశించునని నాకు తెలియును వారు మందను కనికరింపరు మరియు శిష్యులను తమవెంట ఈడ్చుకొని పోవలెనని వంకర మాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలుదేరుదురు. అపొ.కార్య. 20:29,30.

మనం నిర్మింపబడిన విధానం దేవుని ఉద్దేశానికి అనుగుణంగా వుందని గ్రహించి నప్పుడు, మనుష్యులు తమ కోసం శిష్యులను ప్రోగు చేసుకుంటారని వింటానికి ఆశ్చర్యంగా ఉండదు. దేవుని రాజ్యంలో కుమారులుగా ఉన్నతమైన స్థానాన్ని పొందటా నికే దేవుడు మనల్ని సృష్టించాడు అందుకే, ఆయన మహిమ కోసమైన ఒక సహజ కోరికను మనలోని ప్రతి ఒక్కరిలోను పెట్టాడు. తత్ఫలితంగా, యేసుక్రీస్తు తిరిగివచ్చు నప్పుడు మహిమ అనుగ్రహింపబడుతుందనే నిరీక్షణను మత సంబంధమైన వ్యక్తులు కలిగివుండని పక్షమందు వారే సంఘాలకు ప్రమాదకారులుగా ఉంటారు (గలతీ. 1:6-10). వారు తమ అవిశ్వాసాన్ని బట్టి ఈ లోకంలోనే ఇప్పుడే మహిమ కోసం అన్వే షిస్తారు (యోహాను 5:44). "మనుష్యరీతిగా" నడుచుకుంటూ, మనుష్యుల వల్ల ప్రస్తుతం ఘనతను కోరుకునే నాయకులు మనప్రభువు స్థాపించిన సంఘమునకు భిన్నమైన సంఘాన్ని స్థాపించగలరు.

క్రీస్తు సంఘంలో మనుష్యులకీయబడిన పదవులు తమ స్వకీయ మహిమ కోసం ఉద్దేశింపబడ లేదు. దయచేసి, యోహాను 13:3-17లో యేసు తన శిష్యుల పాదాలు కడిగిన సంఘటనకు సంబంధించిన వృత్తాంతం చదవండి. అసలు విషయం ఏదంటే భూమిమీద దేవుని రాజ్యంలో నాయకులు మహిమ కోసం తాపత్రయ పడ కూడదు. ప్రభువు కోసం మనం గృహనిర్వాహకులవంటి సేవకుల్లా ఉండాలి. మనకు మహిమ వచ్చేది ఇప్పుడు కాదు ప్రస్తుతం సేవకత్వం తరువాత మహిమ. అయితే, దేవుడు చేసిన ఈ ఏర్పాటు కొందరికి తృప్తిగా వుండదు (గలతీ. 4:17). అపొస్తలులు దులిపిన పాదధూళి తిరిగి నేలకి చేరక ముందే ఘనత గల స్థానముల కోసం మనుష్యులు ప్రాకులాడటం మరియు పెనుగులాడటం ప్రారంభించటం జరిగి పోయింది. ఘనతగల ఈ స్థానములు బైబిలు గ్రంథములో కనిపించవు. ఇదేసమస్యను పరిష్కరించటానికి కొరింథీ పత్రికలు వ్రాయబడ్డాయి. కొరింథీ సంఘంలో తలయెత్తిన ఈ సమస్యే ఈనాడు మత ప్రపంచంలో ప్రధాన సమస్యగా వుంది. కేథలిక్కు సంఘాన్ని, మత శాఖలను మరియు తన స్వరక్తమిచ్చి యేసు తనసంఘాన్ని కొన్నప్పటి నుండి మొలకెత్తిన అనేకమైన ఇతర "ఇజాలను" ఈ సమస్య మనకు అను గ్రహించింది. క్రీస్తుసంఘంలో నేటికింకా ఇది ఒక శక్తివంతమైన సమస్యగానే వుందని మనం తీవ్రంగా ఆలోచించవలసి వుంది.

"ప్రతి స్థానిక సంఘంలోను" పరిశుద్ధాత్ముడు పెద్దలును నియమించి ఆరువందల సంవత్సరాలు గడిచిపోయాయి. మనుష్యరీతిగా నడుచుకొనే నాయకుల ద్వారా లేఖన విరుద్ధమైన పదవులు ఒకదాని తరువాత మరియొకటి కల్పింపబడ్డాయి. ఆ తరువాతనే పోపు పదవి ప్రప్రథమంగా స్థాపింపబడింది. స్వార్థ పూరితమైన దురుద్దేశాలు కలిగి యుండిన మనుష్యుల వల్ల జరిగిన పని ఇది (ఫిలిప్పీ. 1:17). అప్పటికి రమారమి వెయ్యేండ్ల తరువాత ఐరోపా ఖండంలో కొందరు వ్యక్తులు కేథలిక్కు సంఘాన్ని సంస్కరిం చాలని నిర్ణయించుకొన్నారు. తత్ఫలితంగా, ప్రస్తుతం మనం చూస్తున్న మత శాఖలు, గ్రూపులు పుట్టగొడుగుల్లాగ లేచాయి. వారంతా దేవుడు ఆమోదించని పదవులు, స్థానాలు మానవుల కోసం స్థాపించుకొన్నారు. ఈ సామెతను అతి జాగ్రత్తగా పరిశీలించి అందులో ఏమైనా జ్ఞానం వుందేమో చూడండి. "సరియైన ప్రభుత్వాన్ని కలిగివుండిన సంఘం అన్ని విషయాలలోను సరిగా వుంటుంది లేదా సరియైన ప్రభుత్వం కలిగి ఉండని సంఘం అన్ని విషయాలలోను పొరపాటుగానే ఉంటుంది" (A church will not go very far wrong with correct government, or very far right without it.)

ఇప్పటికి రెండు వందల సంవత్సరాలకు పూర్వం మత శాఖలలోని కొందరు మనుష్యులు దేవుని వాక్యానుసారంగా తమ్మును తాము సరిదిద్దుకోవాలనే నిర్ణయానికి రావటం జరిగింది. ఆనాడు ఆరంభమైన **పునరుద్ధరణ** నేటికీ కొనసాగుతూ ఉంది. అయితే బైబిలులోని పద్ధతికి అనుగుణంగా సంఘ ప్రభుత్వాన్ని మనం పునరుద్ధరించ నంతవరకూ పునరుద్ధరణ కార్యక్రమం సంపూర్ణం కాబోదు. సువార్తికుణ్ణి సంఘ కాపరిగా లేక మేపేవానిగా ఉపయోగించుకొనే మత శాఖల విధానాన్ని చాల సంఘాలలో ఎరవుగా తెచ్చుకోవటం జరిగింది. ఇలాంటి సంఘాలలో పెద్దలు సాధారణంగా పేరుకు మాత్రమే పెద్దలుగా ఉండి "వంటమనిషి వెళ్లిపోయాక మిగులుసగులు పదార్థాలు వడ్డించే వారుగా వుంటారు." (In these churches the elders are generally used to "serve a little canned soup on cold days.) ఓ రెండు సంగతులు సంభవించనంతవరకూ సంఘ ప్రభుత్వం విషయంలో క్రీస్తు సంఘాన్ని మనం పునరుద్ధ

రింపలేము. రక్షింపబడిన వారిని పెద్దలు మేపటం మరియు నశించినవారికిసువార్తికులు సువార్త ప్రకటించటం అనే ఈ రెండు సంగతులు సంభవించటం మనం చూడాలి.

ఈ రెండు పనులు జరగాలంటే ముందుగా ఆర్ధికపరమైన ఒకసమస్య పరిష్కరింప బడవలసి వుంది. మనప్రభువుయొక్క సంఘంలో బహుకొద్దిమంది పెద్దలు మాత్రమే ఆర్థికసహాయం పొందుతున్నారు ఏదిఏమైనా, సువార్తికుల యొక్క ఆర్థికస హాయాన్ని అధికారపూర్వకంగా తెలియజేసే అదే లేఖనం పెద్దలకు కూడా ఆర్థికంగా సహాయం చేయాలని అధికార పూర్వకంగా తెలియజేస్తుంది. ఆ లేఖనంలో ఇలా వుంది. "నూర్చెడి యెద్దుమూతికి చిక్కము వేయకూడదు" (ద్వితీ. 25:4). తిమోతికి పౌలు వ్రాసిన ఉత్తరంలో ఈ సూత్రం వాక్యమందును ఉపదేశమందును ప్రయాసపడు పెద్దలకు వర్తింపచేయబడింది (1 తిమోతి 5:17, 18) ఇదే సూత్రాన్ని కొరింథీ పత్రికలో పౌలు వాక్యాన్ని ప్రకటించే వారికి అన్వయించాడు. సువార్త ప్రకటించేవారంతా ఆర్థికసహాయం పొందటానికి అర్హులే అయితే, వారికి సహాయంచేయటానికి ఇష్టపడే సంఘాలు వారు కనుగొనగలగాలి (1 కొరింథీ. 9:6-14). ఉపదేశకులు కూడా ఆర్థికసహాయానికి అర్హులు కావచ్చు. ఎందుకంటే, "వాక్యోపదేశము పొందువాడు ఉపదేశించువానికి మంచి పదార్థములన్నిటిలో భాగమీయవలెను" అని పౌలు చెప్పాడు (గలతీ. 6:6). ఈ సందర్భంలో "భాగమిచ్చుట" అనే మాట ఉత్తర ప్రత్యుత్తర ములు జరుపుటలేదా సమిష్టిగా వినియోగించుకోవటం అనే అర్థాలను తెలియజేస్తున్నది. "కటేఖియో" (KATECHEO) అనే గ్రీకు పదం నుండి "ఉపదేశించుట" అనే మాటవచ్చింది. దాని భావమేమనగా క్రిందికి దిగి చెప్పుట లేదా నోటిమాట మూలంగా హెచ్చరికచేయుట. "వానికి" అనే మాటనుబట్టి వాక్యోపదేశం చేసేది పురుషుడని గ్రహించుకొనుచున్నాము. ఈ మగసభ్యుడు తన నోటిమాటతో వాక్యాన్ని ఉపదేశించి, తాను వాక్యోపదేశం చేసిన వ్యక్తి నుండి లేదా వ్యక్తుల నుండి ఏదో విధమైన సహాయాన్ని పొందటానికి అర్హత సంపాదిస్తాడు.

నశించినవారికి సువార్తికులు సువార్త ప్రకటించటం ఆదర్శవంతమైన పరిస్థితి ఔతుంది. నశించినవారికి సువార్త ప్రకటించటం సువార్తికులు కొనసాగించుచుండగా మార్పుచెందినవారు వారికి సహాయం చేయవలసి వుంది. రక్షణ పొందినవారికి ఉపదేశం చేయటానికి ఎవరూలేని పక్షమందు అవశ్యముగా సువార్తికులే వారికి ఉపదేశకులుగా కూడా ఉండగలరు. ఉపదేశకులు కూడా సహాయం పొందటానికి అర్హులేనని జ్ఞాపకం చేసుకొందాం. అదే వ్యక్తి రెండుపనులు చేయగలడు. అంటే, వాక్యమును ప్రకటించటం మరియు వాక్యాన్ని ఉపదేశించటం రెండూ ఒకరే చేయవచ్చు. పెద్దలు ఒక పదవిలో నియమింపబడునట్లుగా సువార్త ప్రకటించే క్రైస్తవులు, వాక్యో పదేశం చేసే క్రైస్తవులు ఒక పదవిలో నియమింపబడరు. ఎందుకంటే, ఇవి పదవులు కావు. వాక్యోపదేశం చేసినప్పుడు వారు ఉపదేశకులు. సువార్త ప్రకటించుప్పుడువారు సువార్తికులు. అయినప్పటికీ, అధ్యక్షపదవికి పెద్దలు నియమింపబడతారు. పెద్దలుగా పనిచేస్తూ వారు ఉపదేశకులుగా, సువార్తికులుగా కూడా పనిచేయగలుగుతారు. ఉపదేశం చేసేవారు, సువార్త ప్రకటించే వారు ఇరువురూ ఆర్థిక సహాయం పొందటానికి తగినవారే. అయితే, పెద్దలకు సహాయం చేయటానికి ఎల్లవేళలా మనం ఇష్టపడటం లేదు.

సువార్తికులుగా తమ్మును తాము గుర్తింపచేసుకొన్న వారికి సహాయం చేయటానికి క్రీస్తు సంఘాలు సాధారణంగా ఇష్టపడుతూ వుంటాయి. దయచేసి, ఈ ఆలోచనను పరిశీలించండి. నశించినవారికి సువార్త ప్రకటించునప్పుడు సువార్తికులకు సహాయం చేయాలని దేవునివాక్యం ఆదేశించిన యెడల, సహాయం పొందుతున్న సువార్తికులు నశించినవారికి సువార్త ప్రకటిస్తూనే ఉండాలని చెప్పటం వాదనకు నిలుస్తుంది. నశించిన వారికి బోధింపవలసిన సువార్తికులను వారి యొద్ద నుండి ఈడ్చుకొనిపోయి మందను మేపటానికి వారిని వినియోగించుకోవటం ఎందుకు ప్రారంభించాము? అదైనా, పెద్దలు నియమింపబడిన సంఘాలలో చాలా చోట్ల ఈ పరిస్థితి అగుపిస్తుంది. అనర్హులైన మనుష్యులను పెద్దలుగా నియమించినామా? మందను మేపటానికి కావలసిన అర్హతలు కలిగివుండని వారిని సంఘం పెద్దలుగా నియమించరాదు. ఒకవేళ మనం నియమించిన పెద్దలు అర్హతలు కలిగినవారైతే, పెద్దలైన వీరు చేయవలసిన పనిని చేయటానికి సువార్తికులకు మనం ఎందుకు సహాయం చేయాలి? దశాబ్దాలుగా ఈ పరిస్థితి ఎక్కడ వుంటున్నదో అక్కడ ఏదో లోపం ఉండి తీరాలి.

పెద్దలకివ్వబడిన భార భరితమైన పనిని వారు జరిగించునట్లు వారికి అధికారం, ఆర్థికసహాయం సంఘం ఇవ్వాలి. వారు మేపునప్పుడు సంఘం భుజించాలి వారు పై విచారణ చేసినప్పుడు సంఘం వారికి లోబడాలి. తీర్పుదినమందు పెద్దల ఆత్మలు నరకం పాలు కాగలుగుటకు మేపబడని సభ్యులు కారకులౌతారు. అవిధేయులైన సభ్యులు తమ సొంత ఆత్మలను తామే నరకం పాలు చేసుకొంటారు (హెబ్రీ. 13:17). అధ్యక్షులతో పాటు సంఘ బాధ్యతలలో సువార్తికుడు మిగిలిన సభ్యులకంటే అధికంగా పాలుపంచుకోడు. సభ్యులకెంత బాధ్యత వుంటుందో సువార్తికుడికి కూడా అంతే బాధ్యత వుంటుంది. ఈ క్రింది లేఖనాల అధ్యయనంవల్ల ప్రకటించువాడు మరియు సువార్తికుడు అనే అంశానికి సంబంధించిన వివరణ మనకు లభిస్తుంది. పరిచారకుడు అనే మాటను కూడా మనం ఆలోచించుదాం. ఎందుకంటే, సహాయం పొందుతున్న కొందరు వ్యక్తులు పరిచారకులుగా గుర్తింపు పొందుతున్నారు. దీనిని కూడా చూద్దాము.

*ప్రకటించువాడు (preacher) కెరుక్స్ (KERUX) ప్రకటన చేయువాడు (1 తిమోతి 2:7; 2 తిమోతి 1:11; 2 పేతురు 2:5)*

*ప్రకటించువాడు (preacher) కెరుస్ (KERUS) కేకవేయుట (to cry), లేక ప్రకటనచేయుట (proclaim) (రోమా. 10:14)*

ప్రకటించుట *(preaching)* కెరుస్సో (KERUSSO) కేకవేయుట, లేక ప్రకటన చేయుట (మత్తయి 3:1 , 14:17, 23; 2 కొరింథీ 1:19).

ప్రకటించెను *(preached కటాజెలో (KATAGGELO)* వివరంగా చెప్పుట *(to tell thoroughly)* (అపొ. కార్య. 4:2; 1 కొరింథీ 9:14; కొలొస్స. 1:28).

సువార్తికుడు *(evangelist)* ఎవాంజెలిస్టెస్ *(EVANTELISTES)*మంచి వర్త మానాన్ని ప్రకటించేవాడు *(one who announces good tidings)* (అపొ. కార్య. 21:8 ; ఎఫెసి. 4:11 ; 2 తిమోతి 4:5).

పరిచారకుడు *(minister)* డయాకోన్స్ (DIAKONES) ప్రయాసపడేవాడు సేవచేసేవాడు, పరిచర్యచేసేవాడు (1 కొరింథీ 3:5; 2 కొరింథీ 3:6, 6:4, 11:23).

పరిచారకుడు *(minister)* హ్యూపెరెట్స్ *(HUPERETES)*, పడవనడుపువానికి సహాయకుడు, ఉపచారం చేసేవాడు, సహాయం చేసేవాడు. (లూకా 1:2; అపొ. కార్య. 13:5, 26:16; 1 కొరింథీ. 4:1).

సువార్తప్రకటన అనే ఘనమైనపని జరిగించేవారు అంటే సువార్తికులు ఏమై ఉన్నారో పైన వివరించిన మాటల అర్థం తెలియజేస్తుంది. వారి పనిని వారు చేయ టానికి నశించినవారితోనే వారు ఎక్కువగా సంబంధం పెట్టుకోవాలి. నశించినవారి దగ్గరకు సువార్తికులను పంపాలి లేదా వీరిదగ్గరకి నశించినవారిని తీసుకొనిరావాలి.

ఈనాడు మన ప్రభువు యొక్క సంఘంలో బహు తీవ్రమైన గందరగోళానికి కారణమైన ఒక "నిశ్శబ్దబోధ"ను గూర్చి ఇపుడు మనం చెప్పుకుందాం. క్రీస్తు సంఘాలు పెక్కింటిలో బైబిలు ప్రకారమైన సంఘ ప్రభుత్వం పునరుద్ధరింపబడకపోవటానికి కారణం ఆ బోధే కావచ్చు. తిమోతి మరియు తీతు అనువారు చేసిన పనితో నేటి సువార్తికులు తమపనిని గుర్తింప చేసుకోటానికి ప్రయత్నించినప్పుడు సమస్య యేర్పడుచున్నది. చాలా సంఘాలలో ఈ సమస్యను మనం ఇప్పుడు ఎదుర్కొంటున్న విధంగా ఈ గుర్తింపు వారికి కొన్ని "మర్మమైన అధికారాలను" అనుగ్రహించి వారిని ఏహ్యమైన స్థానంలో వుంచింది. మతశాఖలలోని సంఘాలలో ఈ స్థానం అసహ్యమైనదిగా ఉండదు. ఎందుకంటే, సాధారణంగా వారు ప్రభువు నియమించిన వ్యవస్థనుండి పెద్దలను ఏనాడో తొలగించివేశారు. క్రీస్తు సంఘాలలో నేడు అనేక మంది సువార్తికులు కలిగి వుండే స్థానం ఆచరణలో మతశాఖల సంఘాలలోని పాష్టర్లు కలిగి ఉండే స్థానాల వంటివిగా వున్నాయి. ఇలాంటి పరిస్థితి మందను మేపటానికి అర్హతలు గలిగిన పెద్దలను **అత్యంత హీనమైనస్థితిలో** ఉంచుతుంది. నశించివారిని అలక్ష్యంచేయటానికి ఈ పరిస్థితి కారణమౌతుంది. అంతేకాక, అనేక సందర్భాలలో లేఖనానుసారమైన సంఘ ప్రభుత్వాన్ని విచ్ఛేదము చేస్తుంది. సామాన్యంగా, మనం సంఘ ప్రభుత్వాన్ని గూర్చి సరిగానే బోధిస్తాము. అయితే, ఆచరణలో మాత్రం మత శాఖలలోని పాష్టరు సాంప్రదాయంలోనికి నిశ్శబ్దంగా జారిపోతున్నాం.

తీతు, తిమోతీలకు వ్రాయబడిన పత్రికలు అర్థం చేసుకోవాలంటే అపొస్తలుడైన పౌలుతో వారికుండిన ప్రత్యేకమైన సంబంధం మనకు అర్థమవ్వాలి. ఆ రోజుల్లో తిమోతీ, తీతులు కలిగియుండిన స్థానం ఈ రోజుల్లోని సువార్తికులు కలిగియుండలేరు. తిమోతీ, తీతులను సువార్తికులు కాదనటంలేదు నేడు క్రైస్తవులైన మగసభ్యులు సువార్తి కులు కాజాలరని కూడా చెప్పటంలేదు. అయినప్పటికీ, తిమోతీ, తీతు అను వారి యొక్క పనిలోని ఒక భాగానికి ఈనాటి సువార్తికుల యొక్క పనికి మధ్యగల వ్యత్యాసం అపొస్తలుల అధికారమే. అపొస్తలుడైన పౌలును జాగ్రత్తగా వెంబడించి, తిమోతీ, తీతులు జరిగించిన పరిచర్యలో అధికభాగం పౌలు యొక్క అపొస్తలత్వానికి చెందిన దేనని గుర్తించుదాము. వారికున్న అధికారం యావత్తు పౌలు అపొస్తలత్వం వల్ల వచ్చింది. అపొస్తలులు "ఇకలేరు" గనుక అపొస్తలుడైన పౌలుద్వారా తిమోతీ తీతులకు ఇవ్వబడిన అధికారం కూడా ఇక ఉండదు. దయచేసి, ఈ క్రింది విషయాల్ని, లేఖనాల్ని అధ్యయనం చేయండి.

**పౌలు యొక్క అపొస్తలత్వం - 1 కొరింథీ 9:2**

- నియమములను ఇచ్చాడు, 1 కొరింథీ. 7:17, 16:1
- సంఘాలను బలపరిచాడు, అపొ. కార్య. 15:41
- పెద్దలను పిలిపించాడు, అపొ. కార్య. 20:17
- దూతలను పంపాడు, ("అపొస్టలాస్") అను పదం నుండి తర్జుమా చేయబడింది) 2 కొరింథీ. 8:23
- సంఘముల యొద్ద దొంగిలించాడు, 2 కొరింథీ. 11:8
- సంఘములను గూర్చి చింతించాడు, 2 కొరింథీ. 11:28
- ప్రకటించువాడు, 1 తిమోతి. 1:11

**తీతు - పౌలుయొక్క జతపనివాడు మరియు పాలివాడు, 2 కొరింథీ 8:23**

- భయముతోను వణకుతోను కొరింథీ సంఘం అతనిని చేర్చుకొన్నది 2 కొరింథీ. 7:15
- కొరింథులో దాతృత్వ పరిచర్య ఆరంభించాడు, 2 కొరింథీ. 8:6
- పరిశుద్ధుల కొరకైన పరిచర్యలో సహాయం చేసాడు, 2 కొరింథీ. 8:19
- పౌలుతో ప్రయాణం చేసాడు, గలతీ. 2:1
- "నేను (పౌలు) నీకాజ్ఞాపించిన ప్రకారం నీవు లోపముగా ఉన్నవాటిని దిద్ది ప్రతిపట్టణములోను పెద్దలను నియమించు నిమిత్తమే నేను నిన్ను క్రేతులో విడిచివచ్చితిని" తీతు. 1:5

**తిమోతి - పౌలుతో ప్రయాణం చేసాడు, అపొ.కార్య. 16:1,2**

- పౌలు తిమోతిని ఆజ్ఞపించాడు, అపొ. కార్య. 17:15

- పౌలు యొక్క జతపనివాడు, రోమా. 16:21
- పౌలు అతడ్ని పంపించాడు, అపొ. కార్య. 19:22; 1 కొరింథీ. 4:17; 1 థెస్స. 3:2
- పౌలు కోసం ప్రభువు పనిని చేసాడు, ఫిలిప్పీ. 2:19, 20
- ప్రకటించాడు, 2 కొరింథీ. 1:19
- పౌలు, తిమోతిలు సంఘాలకు ఉత్తరాలు వ్రాసారు, ఫిలిప్పీ. 1:1
- తిమోతీ ఒక కృపావరాన్ని కలిగి ఉన్నాడు, 1 తిమోతి. 4:14, 5:22
- ఏది బోధించాలో తిమోతికి పౌలు చెప్పాడు, 1 తిమోతి. 4:11
- ఏదిచేయాలో తిమోతికి పౌలు చెప్పాడు 1 తిమోతి. 5:9, 19

పౌలు పెద్దల్ని పిలిపించాడు, దూతలను పంపాడు, సంఘాలను స్థిరపరిచాడు, ఒక స్థానిక సంఘంలో పనిచేయటానికి మరో స్థానిక సంఘం యొక్క ధనాన్ని దొంగిలించానన్నాడు అయితే, అతడుగాని లేదా ఇతరులైన అపొస్తలులు కాని పెద్దల అధికారం క్రింద ఎన్నడూ పనిచేయలేదు. తిమోతీ, తీతు మరియు ఇతరులు అతని యొక్క దూతలు, జతపనివారు, మరియు పాలివారు. ఇదంతా అపొస్తలుడుగా తాను జరిగించే పరిచర్యలోని భాగమే. వారంతా ప్రకటించినవారే. అయితే, క్రీస్తు సంఘాలపై వారికి అధికారం ఇచ్చింది పౌలు యొక్క అపొస్తలత్వమే.

నేడు అపొస్తలులు జీవించిలేరు కాబట్టి, స్థానిక సంఘానికి వెలుపల భూమి మీద మరే అధికారాలు లేవు. మనం క్రీస్తు యొక్క శరీరమై ఉన్నాము మనకు ఏకైక శిరస్సు యేసుక్రీస్తు. పెద్దల పై విచారణ క్రింద ఉండని సభ్యులెవరూ సంఘంలో ఉండరు. సభ్యులందరి విషయంలో పెద్దలు లెక్క అప్పగించవలసివుంది. అయితే, తిరుగుబాటు చేసే సభ్యుల విషయంలో మాత్రం కాదు (హెబ్రీ. 13:17). సువార్తప్రకటన అనే పని కొనసాగాలి. అయితే, సభ్యులలో ప్రతి ఒక్కరి వలెనే సువార్తికుడు కూడా సంఘ ప్రభుత్వానికి లోబడాలి.

దేవుని యొక్క సంపూర్ణ పథకాన్ని విడిచిపెట్టి మరో మార్గంలో పోవటానికి తరుచూ చెప్పే సామాన్యమైనసాకు అర్హతలుగల పెద్దలు మనకు లేరు అనేది. కొన్ని సందర్భములలో ఇది నిజమేనని తెలిసికొన్నప్పుడు మనకు బాధగా వుంటుంది. అయినప్పటికీ, మరో దృక్పథాన్ని మనం అనుసరింపకపోతే అర్హతలుగల పెద్దలు తగినంత మందిని మనం ఎన్నడూ కలిగియుండలేము. ప్రభువు యొక్క సంఘాన్ని మనం ఎన్నడూ పునరుద్ధరించలేం. సంఘ ప్రభుత్వం విషయంలో పునరుద్ధరణ దిశగా క్రీస్తు సంఘాలు ప్రయాణిస్తున్నాయి. అదే త్రోవలో వారు కొనసాగటానికి ఈ క్రింది సలహాలు వారికి సహాయం చేస్తాయి. అదే సమయంలో ప్రపంచ వ్యాపకమైన సువార్త ప్రకటన జరిగించటానికి కూడా అవి సహాయం చేస్తాయి.

- సువార్తికుడు చేయవలసిన పనిని గూర్చియు, సువార్తికుని గూర్చియు సరియైన దృక్పథాన్ని మనం అందరం కలిగివుందాం.
- అధ్యక్ష పదవికి అర్హులైన సువార్తికులంతా మందను మేపటం కొనసాగించాలనే నిర్ణయం తీసుకొంటే వారు ఆ పదవిని అంగీకరించాలి.
- పెద్దలు ఇచ్చే కానుకలపై సంఘాలు ఆధారపడి ఉంటే పెద్దలు ఎక్కువ గంటలు లౌకికపని చేయవలసి వుంటుంది. కాబట్టి పెద్దలు మందను అలక్ష్యం చేయటానికి ఈ పరిస్థితి వారిని బలవంతం చేస్తే పెద్దల కానుకలపై ఆధారపడే స్థితి నుండి సంఘాలను విడిపించుదాం.
- బోధన, ప్రకటన, చేసే పెద్దలకు ఆర్థిక సహాయం చేయటానికి మనం ఇష్టపడదాం.
- మన బైబిళ్లను మనం చదివి "ఎక్కడి నుండి పంపబడ్డాడో మనం ఎరుగ నట్టియు." ఏదో ఒక అధికారం ద్వారా పంపబడిన వాడైన "పైశాచికబోధకుణ్ణి" తొలగించివేద్దాం.
- మహిమ కోసం దేవుడు మనలో నాటిన కోరిక సంతృప్తి పరచబడటానికి దేవుని రాజ్యంలో మనం కుమారులుగా ఉండటమే దేవుని యొక్క పథకమని చూడగలుగునంతగా మనం విశ్వాసంలో పెరుగుదాం. నశించినవారిని గూర్చి ఆలోచన చేయనీయనంతగా మన యౌవనస్థుల కళ్ల ముందు "పుల్‌పిట్" అనే దానిని ఘనతతో అలంకరించవద్దు. సువార్తికులు ముఖ్యంగా ఏపని నిమిత్తం పిలువబడ్డారో ఆ పనినే అనగా నశించినవారికి సువార్త ప్రకటించ టానికే వారికి తర్ఫీదు నిద్దాం.
- సంఘ ప్రభుత్వం విషయంలో మతశాఖలలోని మనుష్యులు కల్పించిన అసత్య సిద్ధాంతాల వల్ల మనం మోసపోకుండునట్లు దేవునికి ప్రార్థన చేద్దాము (ఇది ఎందుకంటే, క్రీస్తు సంఘ సభ్యులలో చాలమందిమి మతశాఖలనుండి వచ్చినవారమే. కాబట్టి, దాని ప్రభావం మనమీద ఎప్పుడూ వుంటుంది.)-
- సంఘ ప్రభుత్వం విషయంలో దేవుని సంకల్పం ఏమైవుందో పెద్దలు, సువార్తికులు, ఉపదేశకులు సంఘములోను లోకంలోను చురుకుగా బోధించాలి.

విశ్వాసులైన క్రైస్తవులు శాశ్వతంగా దేవునికి కుమారులై ఉంటారు. అందువల్ల, క్రీస్తు తన సంఘాన్ని ఒక కుటుంబం వలె వ్యవస్థీకరించుచుండటం సహజమైనదే. క్రైస్తవులలో కొందరికి ఇప్పుడే మహిమ ఇవ్వటానికీ, మరికొందరికి తరువాత ఇవ్వటానికి సంఘం రూపొందించబడలేదు. భూమిపై తర్ఫీదు మరియు సేవ, ఆ మీదట పరలోకంలో దేవునితో మహిమ అనేదే దేవుని యేర్పాటు. సంఘ ప్రభుత్వం విషయంలో దేవుని యొక్క ఏర్పాటును అనుసరించినవారమై దేవునికి మహిమ చెల్లించటానికి జాగ్రత్త వహించుదుము గాక! సువార్తికుల యొక్క "సుందర

పాదాలను" నశించినవారు మరో మారు చూచునట్లుగా కాపరులు మందను మేపుదురు గాక!

*ప్రకటించువారు పంపబడని యెడల ఎట్లు ప్రకటించుదురు? ఇందు విషయమై ఉత్తమమైన వాటిని గూర్చిన సువార్త ప్రకటించువారి పాదములెంతో సుందరమైనవి అని వ్రాయబడియున్నది. రోమా 10:15*

## చర్చ కోసం ప్రశ్నలు

1. సంఘ ప్రభుత్వాన్ని గూర్చి పరిశుద్ధాత్మ అపొస్తలులకు అందించిన ఒక సందేశం ఏది?
2. "క్రైస్తవ మతసంబంధమైన" వ్యక్తులు బైబిలుప్రకారమైన సంఘ ప్రభుత్వాన్ని తృణీకరించటానికి కారణాలు కొన్ని చెప్పండి?
3. మనుష్యులు తమ వెంట శిష్యులను ఈడ్చుకొని పోవటానికి ఒక కారణం ఏది?
4. మన ప్రభువు యొక్క సంఘానికి భిన్నమైన మరో సంఘం స్థాపింపబడటానికి మనుష్యులలోని ఏ రెండు స్వభావాలు ఏకమౌతాయి?
5. మన రాజైన యేసుకు, సంఘపెద్దలకు మధ్య ఎన్ని పదవులను దేవుడు అధికార పూర్వకంగా ఆమోదించుచున్నాడు?
6. కొరింథీ సంఘాన్ని దాదాపు నాలుగు విధాలుగా విభజించిన సమస్య ఏది?
7. ఈ పాఠానికి పేరు పెట్టబడినట్లుగా ప్రభుత్వం అనే మాట యొక్క అర్థం ఏమిటి?
8. సంఘ నాయకత్వం విషయంలో అపొస్తలుల కార్యాల్లో మనం కనుగొనిన మార్పులను వర్ణించండి?
9. తాను వెడలిపోయిన తరువాత ఏమి జరుగుతుందని పౌలు ఎఫెసు పెద్దలతో చెప్పాడు?
10. సంఘమును పాలించేవారిని గుర్తించే గ్రీకు మాటల జాబితాను సిద్ధం చేసి వాటిని నిర్వచించండి.?
11. క్రీస్తు సంఘంలో ఆనాటి అపొస్తలుల కంటే కూడా ఈనాటి పెద్దలే మంచి నాయకులుగా ఉండగలరని యేసు తలంచినట్లుగా మనం ఎందుకు నిర్ధారించ వలసి వుంది?
12. సంఘ నాయకులను గుర్తించే పదజాలాలు యూదా క్రైస్తవులకు ఎందువల్ల సుపరిచితం?
13. పెద్దల యొక్క అర్హతలను మొత్తముగా వ్రాయండి?
14. పెద్దల కోసం అవసరమైన అర్హత విజయవంతమైన తండ్రులై ఉండటం, మానవాళి కోసమైన దేవుని సంకల్పానికి ఎందుకు అనుగుణంగా వుంది?
15. పెద్దల యొక్క పనులను సూచించే పదాలు ఎఫెసీ. 2:19-22 నుండి వరుసగా వ్రాయండి?
16. యౌవనస్థులైన తండ్రులకు పెద్దలు ఎట్లు సహాయం చేయగలరు?
17. స్థానిక సంఘాన్ని ఒక కుటుంబముగా మనం ఎందుకు ఆలోచించాలి?
18. ఆత్మ సంబంధులైన నాయకులు వాస్తవాన్ని ఎట్లు వ్యాఖ్యానిస్తారు?
19. సంఘ ప్రభుత్వం విషయంలో "క్రైస్తవ మత ప్రపంచం" దాని ప్రస్తుత పరిస్థితికి ఎట్లు దిగజారింది?
20. భౌతిక ఇశ్రాయేలీయులను తన రాజ్యముగా కొనసాగించటానికి దేవుడు చేసిన సంకల్పాన్ని ఏది తారుమారు చేసింది?
21. తన శిష్యుల యొక్క పాదాలను కడిగి యేసు ఏ విషయాన్ని మనకు నేర్పించాడు?
22. సువార్త ప్రకటించే సంఘ సభ్యునికి ఆర్థిక సహాయం చేయాలని అధికార పూర్వకంగా తెలియజేసే పాత నిబంధన వచనం ఏది? మరియు అదే వచనం ఈనాడు ఇంకెవరికి వర్తిస్తుంది?
23. ఒక సువార్తికుడు రక్షింపబడినవారి కంటే నశించినవారినే ఎక్కువగా పట్టించు కోవాలని తలంచటం ఎందుకు న్యాయమైంది?
24. ఈ పాఠంలో సూచింపబడిన ఒక "నిశ్శబ్ద బోధ" ఏది?
25. పెద్దల కోసం సంఘాన్ని ఎవరు మేపాలి?